నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
బుధవారం | 17 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

శ్రీ రామనవమి శుభాకాంక్షలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ నవమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. హక్కుల కంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం! కష్టంలో కలిసి నడవాలన్నది సీతాతత్వం, శ్రీరాముడు కష్టాల్లో మనో నిబ్బరం కోల్పోకుండా ముందుకు సాగి విజయం సాధించారనీ, శ్రీరామున్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని అన్నారు. శ్రీరాముని అనుగ్రహముతో అన్నిరంగాల్లో పురోభివద్ధిని సాదించాలని, ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ఆనందం తో పాడి పంటలతో వర్ధిల్లాలని భగవంతున్నీ ప్రార్థిస్తున్నానని అన్నారు. శ్రీ సీతా రామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని వేడుకగా జరుపుకోవాలని, ప్రజలందరు ఆనందోత్సాహాల మధ్య సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

నర్సాయపల్లిలో ఏజీ ఆడిట్ బృందం పర్యటన



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో 2018 నుండి 2022 వరకు చేసిన 16 పనులను ఎంపిక చేసుకొని హార్టికల్చర్ కింద మామిడి తోటలు, ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు, సి.సి రోడ్స్, నర్సరీ, అవిన్యూ ప్లాంటేషన్ పనులను, వర్క్ ఫైల్స్‌లను హైదరాబాద్ ఏజీ ఆడిట్ బీందం సీనియర్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, అడిషనల్ ఆడిట్ ఆఫీసర్స్ కళ్యాణ్, శేషగిరి, కొండయ్య మంగళవారం పనులను పరిశీలించారు అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఎ.పి.డి శివాజీ, డివిజన్ విజిలెన్స్ అధికారి, ప్రభాకర్, పిఆర్ఏఈ వినయ్ కుమార్‌రెడ్డి , ఈసి, పరశురాం టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటమ్మ, మాదవి, దేవేందర్,పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఫీల్డ్ అసిస్టెంట్స్‌తదితరులు పాల్గొన్నారు.



540 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత..

నాలుగు వాహనాలు సీజ్

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ బి.బాలస్వామి

నవతెలంగాణ-మెదక్

అక్రమంగా తరలిస్తున్న 54 టన్నుల (540 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు జిల్లా ఎస్పీ డాక్టర్ బి. బాలస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా అల్లాదుర్గ్ ప్రాంతంలో భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిఘా వేసినట్లు చెప్పారు. అందులో భాగంగా ఏపీ23డబ్ల్యూ2369, టీఎస్12యూసీ6818, ఏపీ24టీఏ3664, టీఎస్15యూఈ 0179 నెంబర్లు గల లారీ, డీసీఎం, బొలెరో, ఐచర్ నాలుగు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ. 10,80,000 విలువ గల 54 టన్నుల (540 క్వింటాళ్ల) పీడీయస్ రైస్ ను గుర్తించడం జరిగిందన్నారు. స్వాదీనం చేసుకున్న వాహనాల విలువ రూ. 23,00,000 ఉంటుందన్నారు. అల్లాదుర్గం ప్రాంతంలోని గడిపెద్దాపూర్ గ్రామం వద్ద గల శ్రీ సాయి వెంకటేశ్వర రైస్ మిల్ యజమాని బి. రమేశ్ అక్రమంగా అదనపు డబ్బులు సంపాదించాలనే భావనతో ప్రభుత్వ ఉద్దేశ్యాలను, లక్ష్యాలను పక్కనపెట్టి స్వలాభం కొరకు పేదలకు అందించే పిడియస్ రైస్ వ్యాపారాన్ని చేసే క్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రైస్ మిల్ వద్ద పట్టుకోవటం జరిగిందన్నారు. రైస్ మిల్ నడుపుతున్న యజమానులు, ప్రభుత్వం నుండి వడ్లను కొనుగోలు చేసి, తమ రైస్ మిల్లులో వడ్లను ప్రాసెస్ చేసి పిడియస్ రైస్ గా మార్చి ఎఫ్సీఐ గోదాంలకు పంపించటం జరుగుతుందన్నారు. కానీ రైస్ మిల్ యజమానులు అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తూ అదనపు లాభాలను సంపాదిస్తున్నారన్నారు. ఈ చర్యలకు పాల్పడిన అందరి పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసుకుంటామని హెచ్చ రించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలించిన ఆయా వాహనాల డ్రైవర్లు అయిన రంగారెడ్డి జిల్లా, కొందుర్గ్ మండలం, చిన్నవెలికిచర్ల గ్రామానికి చెందిన చకాని సాయి విక్రమ్, బీదర్ కు చెందిన గుంబర్ బస్వరాజ్, నల్గొండ జిల్లా చినతపల్లి మండలం, ఉమ్మంతలపల్లి గ్రామానికి చెందిన సూరేకరకు బాలయ్య, సంగారెడ్డి జిల్లా, కల్హేరు మండలం, ముంగేపల్లి, మాణిక్‌నాయక్ తండాకు చెందిన సబావత్ జైరామ్ లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నా మన్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి రెవెన్యూ, గనులశాఖ సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పౌర సరఫరాల శాఖతో కలిసి చర్యలు చేపడుతున్నామన్నారు. అక్రమ కార్యకలాపాలపై జిల్లా ఎస్పి 8712657900 నంబర్‌కు నేరుగా సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ రైస్ పట్టుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని అభినందించి వారికి రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ రాజేష్, అల్లాదుర్గ సీఐ రేణుక, డిప్యూటీ తాహసీల్దార్ ప్రణీత రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిఐ తిరుమలేష్, అల్లాదుర్గ్ ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి, జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది టి.దస్తయ్య, టి.నర్సిములు, ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి, బి.రామాగౌడ్, ఎం.శ్రీనివాస్, కె.భరత్ కుమార్‌లు పాల్గొన్నారు.

జోష్ పెంచిన..
ప్రజా ఆశీర్వాద సభ



- భారీగా తరలొచ్చిన గులాబీ శ్రేణులు
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టిన కేసీఆర్
- రేవంత్‌రెడ్డి హామీల వీడియోలను వినిపించిన హరీశ్‌రావు
- గ్యారంటీలే గడ్డపారలై గుండెల్లో గుచ్చుకుంటయని కామెంట్
- సభికుల్ని ఆకట్టుకున్న దేశపతి 'గోవిందా గోవిందా' పాట
- బీజేపీ, కాంగ్రెస్ దొందు దొందే అన్న నేతలు


మెదక్, జహీరాబాద పార్లమెంట్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్‌ను పెంచింది. రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీ జన సమీకరణ చేశారు. మంగళవారం సాయం త్రం సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభ సక్సెస్ అవ్వడంతో గులాబీ పార్టీలో కొత్త ఊపు తెచ్చింది. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పట్టుపట్టి ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయడంతో కేసీఆర్ సైతం కుషి కుషి అయ్యారు. బారులు తీరిన జనాల్ని చూసి ముచ్చటేసిందని కేసీఆర్ ప్రస్తావించారంటే బీఆర్ఎస్ తొలి ఎన్నికల సభ విజయవంతమైందనే చెప్పాలి. జనాల ఊపును చూసిన కేసీఆర్ బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తానంటూ భరోసా ఇవ్వడం విశేషం. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రారంభంలో పాట-మాట రూపంలో సభకు హాజరైన వాళ్లను ఆకట్టుకున్నారు. గోవిందా గోవిందా కాంగ్రెస్ అంటే గోవిందా అనే పాటకు చప్పట్లు మోతమోగాయి. హరీశ్‌రావు సైతం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీల వీడియోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై వినిపిస్తూ అమలు చేయని హామీల గుర్తించి ప్రస్తావించారు. లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో బీఆర్ఎస్ సభకు నిండుదనం వచ్చింది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెతుకు సీమ రుణం తీర్చలేనిది : కేసీఆర్

ఎంతో ఉన్నతంగా ఎదగడానికి, తెలంగాణ సాధించ డానికి చైతన్యం నింపిన మెతుకు సీమ మెదక్ గడ్డకు చేతు లెత్తి నమస్కరిస్తున్నా అంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్ని జన్మలెత్తినా మెతుకు సీమ రుణం తీర్చుకోలేనిదంటూ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, విస్మరించిన హామీలపై విమర్శనాస్త్రాలను సంధిస్తూ మాట్లాడారు. ముఖ్యంగా మెదక్ ఉమ్మడి జిల్లా రైతాంగ సమస్యల్ని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సింగూరు జలాల్ని హైదరాబాద్‌కు తరలిస్తే బీఆర్ఎస్ ప్రభు త్వం వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టును అనుసంధానం చేసి సింగూరు జలాల్ని పంట పొలాలకు పారించిన విషయాన్ని గుర్తు చేశారు. అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్ మెట్ట ప్రాంతాల్లోని మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిం చేందుకు బసవేశ్వర, సంఘమేశ్వర ఎత్తిపోతల పథకాల్ని చే పట్టి నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక ఆ లిఫ్టుల్ని గట్టున పెట్టిందని హెద్దేవ చేశారు. ఎన్నికల్లో జనం ఆగమై ఓట్లేస్తే బతుకు అడవై పోతదన్నారు. ఉద్యోగులు, మేధావులు ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓట్లేయా ల ని కోరారు. పోలీసుల ఆగడాలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. డీజీపీ మళ్లీ మేం అధికారంలోకి వస్తాం తస్మా జాగ్రత్త అంటూ హెచ్చరించారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేద ని,ఆ పార్టీకి ఓటేస్తే సింగూరు కాల్వలో వేసినట్లే అవుతుందన్నారు.

వద్దురో నాయనా ఈ కాంగ్రెస్ పాలన : హరీశ్‌రావు



ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్ని విస్మరించిన కాంగ్రెస్ నైజం తెల్సుకున్న ప్రజలు వద్దురో ఈ కాంగ్రెస్ పాలన అంటున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పలు హామీలకు సంబంధించిన వీడియోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై వినిపించారు. విస్మరిం చిన ఒక్కో హామీ గురించి ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తి చూపారు. 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్టు, ఇంటి వద్దకే మంచినీళ్ల ఇచ్చిన బీఆర్ఎస్ పాలనను గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక ఎనకటి రోజులు దాపురిస్తున్నాయన్నారు. అమలు చేయని ఆరు గ్యారంటీలే గడ్డపారలై ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం నేర్పుతారన్నారు. డిసెంబర్ 9న చెల్లిస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. వడ్లు, మక్కలకు బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, బోనస్ రానోళ్లంతా కాంగ్రెస్‌ను బొందపెట్టాలని పిలుపు నిచ్చారు. నెలకు రూ.2500 ఇస్తామని మహిళలకు హామీ ఇచ్చి మోసం చేసినందున నాలుగు నెళ్లకు గాను రూ.10 వేలు ఇచ్చి ఓట్లు అడగాలని మహిళలు కాంగ్రెసోళ్లను నిలదీయాలని పిలుపు నిచ్చారు. రైతులు, ప్రజల విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండు దొందు దొందే అన్నట్లుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌పై కోసం బీజేపీ ఓట్లేస్తే మరింత ఆగమైతమన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు.

ఆకట్టుకున్న 'దేశపతి' గోవందా పాట..

సభ ప్రారంభానికి ముందు రసమయి బాలకృష్ణ, ఇతర కళాకారులు అనేక పాటలు పాడారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాత్రం పాట-మాట రూపంలో సభకు వచ్చిన వాళ్లను ఆకట్టుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఏనాడూ అనలేదని, అధికారంలోకి వచ్చాక అమరు స్థూపం వద్ద నివాళ్లు అర్పించిన దాఖలాలు కూడా లేవన్నారు. రేవంత్‌రెడ్డి చాతిని చించితే చంద్రబాబు కనిపిస్తాడన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని రేవంత్‌రెడ్డి అనడం హస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ అనువణువునా కేసీఆర్ ఉంటాడన్నారు. అంబేద్కర్ జయంతి రోజున సీఎం దండవేయకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ నాలుగు నెళ్ల పాలనపై ఆయన పాట పాడారు. గోవిందా...గోవిందా...కాంగ్రెస్ అంటే గోవిందా అనే పాట సభను ఉర్రూతలూగించింది.

ఆదరిస్తే అండగా ఉండి సేవ చేస్తా: వెంకట్రాంరెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలు ఆదరించి ఓట్లేసి గెలిపిస్తే అండగా ఉండి ఆదుకుంటానని ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిలో పాలు పంచుకోవడం అదృష్టంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లేయడం అంటే మరింత ఆగమై పోవడమే అవుతుందన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. రూ.100 కోట్లతో ట్రస్ట్ పెట్టి ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే తెలంగాణ హక్కులపై కొట్లాడుతం: గాలి అనిల్‌కుమార్, ఎంపీ అభ్యర్థి

బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం కోట్లాడుతామని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ గతంలో ఎంపీగా పనిచేసినా నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. 20 ఏళ్లుగా తెలంగాణ కోసం కోట్లాడిన వ్యక్తిగా ప్రజా సేవ చేస్తానన్నారు. ప్రజలు ఆశీర్వాదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సభలో మాజీ మంత్రి మహబూబ్ అలీ, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్యరావు, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మెదక్ డీసీసీ వైస్ చైర్మన్ మాణిక్యం, దేవీశ్రీప్రసాద్, మఠం బిక్షపతి, తన్వీర్, బీర య్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ పాల్గొన్నారు.



సంఘీభావ నిధి అందించిన కార్మికులకు జేజేలు

- పోరాటాలతో పాటు సంఘీభావ కార్యక్రమాల్లో కార్మికులు నిలవడం అభినందనీయం
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- సంగారెడ్డి జిల్లాలో కార్మికుల నుంచి సేకరించిన సంఘీభావ నిధిని సీఐటీయూ రాష్ట్ర కమిటీకి అందజేత



నవతెలంగాణ-సంగారెడ్డి

సామాజిక ఉద్యమాలను బలపర్చుతూ సంఘీభావనిధి అందించిన కార్మికులకు జేజేలు అని.. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటమే కాకుండా సంఘీభావ కార్యక్రమాల్లో కార్మిక వర్గం ముందుండడం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ మాజీ వ్యవస్థాపక అధ్యక్షులు బి.టి రణధివే వర్ధంతి ఏప్రిల్ 6 నుంచి అంబేద్కర్ జయంతి వరకు.. మహనీయుల జయంతి, వర్ధంతుల సందర్భంగా సామాజిక సంఘీభావ నిధి సేకరించాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో కార్మికుల నుంచి సేకరించిన రూ.1,61,547ను హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి పాలడుగు భాస్కర్, చుక్క రాములు చేతుల మీదుగా రాష్ట్ర కమిటీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. పాలకులు దళిత, బహుజన, మైనార్టీల సమస్యలు పరిష్కారం చేయకుండా వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్న దుస్థితి ఉన్నదన్నారు. దేశంలో నేటికీ కుల వివక్షత, అంటరానితనం, పేదరికం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వివక్షతను రూపుమాపకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం దళిత, గిరిజన, మైనార్టీల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని.. కులం, మతం, ప్రాంతం పేరుతో దాడులను ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో దళిత బహుజనులందరూ తమ ఓటు హక్కు ద్వారా బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడిస్తేనే దేశంలో దళిత బహుజనుల మనుగడ సాధ్యమన్నారు. సామాజిక న్యాయం, మతసామరస్యం, ఆర్థిక సమానత్వం, కుల నిర్మూలన, వంటి లక్ష్యాల సాధన కోసం సీఐటీయూ దేశవ్యాప్తంగా అనేక పోరాటాలను నిర్వహిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కూడా కులం, మతం పేరుతో విభజించి పాలించాలనే విధంగా చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ సంఘీభావంగా అన్ని రకాల తోడ్పాటును భవిష్యత్తులో అందిస్తుందన్నారు. ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామన్నారు. ప్రజలు సామాజిక ఉద్యమాలను బలపరిచి విరివిరిగా విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలు బలపర్చుతున్న కార్మిక వర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఎస్.వీరయ్య, జె.మల్లిఖార్జున్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, ఉపాధ్యక్షులు రాజయ్య, నాయ కులు మహిపాల్, పాండు రంగారెడ్డి, రాజిరెడ్డి, మంగ, మనోహర్, కొండల్ రెడ్డి,రమేష్, అనంతరావ్ తదితరులు పాల్గొన్నారు.



ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మద్దూరు

ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుధీర్ రాజ్ కోరారు. ఈ సందర్భంగా రేబర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు గ్రామస్తులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున ఒక లీటర్ నీళ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్ కలుపుకొని తాగాలన్నారు. ఉదయం 11 గంటల తర్వాత వెలువడే సూర్య రష్మి కిరణాలు అతి ప్రమా దమని ప్రజలు ఎవరు కూడా ఎండలో తిరగకూడదని ఆయ న కోరారు. ప్రజలు అనారోగ్య సమస్యలు ఏవి ఉన్న హెల్త్ సబ్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరా రు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్ ప్రతిభ, ఏఎన్ఎం మలవొత్రి, లలిత, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఆశా కార్యకర్తలు యశోద, కవిత, కనక లక్ష్మీ పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్‌తో అధిక దిగుబడులు

నవతెలంగాణ-నంగునూరు

ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి జి.సువర్ణ తెలిపారు.మంగళవారం నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ తోటలపై అవగాహన కార్యక్రమానికి హాజరైనారు. వేసవిలో తీసుకో వాల్సిన జాగ్రత్తలు,యాజమాన్య పద్ధతులు, పూల గుత్తులు తొలగించుట, గెలలు కోయుట గురించి రైతులకు వివరిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక దిగుబడి, నిరంతరాయంగా ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని పిలుపునిచ్చారు. వేసవిలో ఆయిల్ పామ్ మొక్కల చుట్టూ జీలుగా,జనుము విత్తనాలను వేసుకోవాలని సూచించారు. వేసవిలో ఇలా మొక్క చుట్టూ జనుము నాటడంల వల్ల గాలిలో తేమశాతం పెరిగి మొక్క పెరుగుదలకు దోహద పడి మైక్రో వాతావరణం వృద్ధి చెందు తుందని చెప్పారు. తదుపరి తొలకరి వర్షాకాలం వరకు జనుము ఎదుగుదలని కొనసాగించి పూత రాకముందే చిన్న ముక్కలుగా కత్తిరించి పాదులో వేయడం వల్ల కలుపు ను నివారించడమే కాకుండా సేంద్రీయ ఎరువుగా మార్పు జరిగి తేమను నిలువరింపు చేస్తోందని అన్నారు.అలాగే మొక్కలకు డ్రిప్ ద్వారా 2నుంచి 3గంటలు నీటిని ఉదయం, సాయంత్రం వేళలో ఇవ్వాలని తెలియజేశారు. పూల గుత్తి లను ఎప్పటికప్పుడు తీసివేయాలని ఇది 30 నెలల వరకు కొనసాగించాలన్నారు. నంగునూరు మండలంలో ఇంకొ రెండు మూడు నెలలలో ఆయిల్ పామ్ గెలల కోత ప్రారంభం అవుతుందని చెప్పారు. గెలలు కొనడం కూడా మొదల వుతుందని తెలిపారు. నర్మెట గ్రామంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయిని చెప్పారు. రైతులెవరు అధైర్యపడవద్దని,ఫ్యాక్టరి పనులు కూడా 10 నెలలో పూర్తవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి శంకర్, హార్టికల్చర్ అధికారి ఆర్.బాలాజీ, ఆయిల్ ఫెడ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆట వస్తువులు అందజేత

నవతెలంగాణ-చేగుంట

మండలంలోని రెడ్డిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రశాంత్ లు మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు అందజేశారు. కేవలం చదువు మాత్రమే కాకుండా మానసిక శారీరక దృఢత్వం కూడా చాలా అవసరమని సంస్థ తరపున ఆట వస్తువులు అందజేసినట్టు చెప్పారు. అలాగే రోడ్డు భద్రతా నియమాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాబాయి, ఉపాధ్యాయులు మధుసూదనరావు, ప్రభాకర్, దేవయ్య శ్రీదేవి, హిమబిందు, పద్మ నాగరాజు, కృష్ణవేణి, మంజులత, రేణుక లు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..
ప్రజాపాలన దరఖాస్తుల దారులకు శాపం



నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజా పాలన లో దరఖాస్తులు పెట్టుకున్న లబ్ధిదారులు రెండు నెలలుగా ఇంకా మున్సిపల్ ఆఫీస్ చుట్టూ ప్రదక్షణ చేయడం తప్పడం లేదు. ప్రజా పాలన దరఖాస్తులు సకాలంలో ఆన్లైన్ చేయడంలో నిర్లక్ష్యం చేశారనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో విద్యావంతులు కూడా కష్టాలు తప్పడం లేదు. నిరక్షరాస్యులకు, అక్షరాస్యులకు సైతం మున్సిపల్ సిబ్బంది చుక్కలు చూపిస్తుంది. ప్రజా పాలన దరఖాస్తు ముగింపు రెండో రోజు నుండి ఆన్లైన్ దరఖాస్తులు చేయవలసింది. ఫోన్ నెంబర్లతో ఐడి నెంబర్ చెప్పవలసి వస్తుందని మున్సిపల్ సిబ్బంది తాత్కాలికంగా ఆన్లైన్ చేసి వదిలివేశారు. ఆ తర్వాత నెల రోజులపాటు మున్సిపల్ పరిధిలో ప్రజలు తిరిగి ఆన్లైన్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ కూడా మున్సిపల్ సిబ్బంది లబ్ధిదారులకు పూర్తి సమాచారం ఇవ్వడం లేదు. 200 యూనిట్లు, 500 రూపాయలకే గ్యాస్ పంపిణీ, మహిళలకు రూ 2500, పెన్షన్. రూ 4000, ఇందిరమ్మ ఇల్లు, రైతుకు సంబంధించిన అనేక ఆప్షన్లు ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తులు పొందుపరిచింది. కానీ కొందరు తెలిసి తెలవక ప్రజాపాలన పత్రంలో వారి కావలసిన విషయాలను గుర్తించి టిక్కు పెట్టారు. గ్యాస్ వచ్చిన వారికి ఉచిత విద్యుత్తు రావడం లేదు, ఉచిత విద్యుత్తు వచ్చిన వారికి గ్యాస్ రావడం లేదు. మున్సిపల్ కార్యాలనుకొచ్చిన ప్రజాపాలన దరఖాస్తుదారులకు ఒకేసారి పూర్తి సమాచారం మున్సిపల్ సిబ్బంది చెప్పడం లేదు. పైగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ లబ్ధిదారులను కార్యాలయం నుండి పంపించేస్తున్నారు. గ్యాస్ ఆఫీస్ కి వెళ్ళండి, అక్కడికి వెళ్తే మున్సిపల్ ఆఫీస్‌కి వెళ్ళండి అని చెప్పడంతో లబ్ధిదారులు విసుగు చెందుతున్నారు. జిల్లా ఉన్నంత అధికారులు, మున్సిపల్ కేంద్రం అధికారులు ఆన్లైన్ పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ప్రజా పాలన దరఖాస్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పార్లమెంటు ఎన్నికల వల్ల చాలామంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ ఆన్లైన్లో కావడం లేదు. మళ్లీ దరఖాస్తు పెట్టుకోవాలని మున్సిపల్ సిబ్బంది ఫారాలు అందిస్తున్నారు. ఈ దుస్థితి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 20 వార్డుల నుండి రోజుకు వందల చొప్పున కార్యాలయం కొచ్చి తిరిగిపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది అధికారుల తీరు మారాలని ప్రజాపాలన దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్యారెంటీలే తప్పా.. అమలు లేదు




నవతెలంగాణ-కొమురవెల్లి

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలు ఇవ్వడమే తప్పా.. హామీలను అమలు చేయడం లేదని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోనీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. మహిళలకు రూ.2500, రైతులకు రూ2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, వడ్లకు రూ.500 బోనస్ లాంటి పథకాలు ప్రజలకు కలలుగానే మిగిలిపోయాయ న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. అధికార పార్టీకి అనతి కాలంలోనే ప్రజలు దూరం అయ్యారని, పార్లమెంటు ఎన్నికల్లో భారీ కాంగ్రెస్ భారీఓటమి చవిచూడక తప్పదన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ గ్యారెంటీల పార్టీగా మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అన్ని వర్గాలను ఏకం చేసి ప్రజా ఉద్యమాలు లేవనెత్తుమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బీజేపీ ఉడుత ఊపులకు భయపడేది లేదు

- కేసీఆర్ కుటుంబం పై అక్రమ కేసులు సిగ్గుచేటు
- బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొట్టాల యాదగిరి ముదిరాజ్



నవతెలంగాణ- గజ్వేల్/వర్గల్

కేంద్రంలోని బిజెపి సర్కార్, ప్రధాని నరేంద్ర మోడీ ఉడుత ఊపులకు భయపడేది లేదని, అలాగే కెసిఆర్ కుటుంబంపై కక్షపూరితంగా నమోదు చేసిన కేసులకు తగిన విధంగా బుద్ధి చెప్తామని బిఆర్ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు, నాచగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. మంగళవారం గజ్వేల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి అమలుకు సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారం చేపటగా, ఇప్పటికే వంద రోజులు దాటుతున్నా అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు .అంతేకాకుండా కెసిఆర్ సంకల్ప బలం, మాజీ మంత్రి హరీష్ రావు కృషి, అప్పటి కలెక్టర్, ఇప్పటి బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి చొరవ ఫలితంగానే మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లు స్పష్టం చేశారు. నిస్వార్థంగా సేవలందించే మంచి మనస్తత్వం కలిగిన వెంకటరామిరెడ్డిని గెలిపించుకుంటే గజ్వేల్ సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే సీఎం రేవంత్ రెడ్డి పంట రుణమాఫీ ప్రకటించినట్లు ఎద్దేవా చేశారు. రైతులు, యువత, వద్దులు, వితంతు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం తగదని, రూ 500 బోనస్ వెంటనే ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే వంద రోజుల్లో వివిధ పథకాలు అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి పేదలను అధోగతిపాలు చేస్తుండగా, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 పార్లమెంటు స్థానాలు దక్కించుకోవడం ఖాయమని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడిగే రాజు, లింగ స్వామి, నరేష్, రమేష్, శేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ తగాదాలతో సొంత ఇంటికే నిప్పు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

కుటుంబ తగాదాలతో సొంత ఇంటికే నిప్పు పెట్టిన ఘటన నారాయణ రావుపేట మండల కేంద్రంలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ రావుపేట గ్రామానికి చెందిన పొన్న మేని నరసింహులు, ఆయన భార్య రేణుకతో తరచూ గొడ వలు జరుగుతుండేవి. ఈ క్రమంలో రేణుకను శారీరకంగా మానసికంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న భార్య పిల్లలతో నరసింహు లు గొడవపడి.. కోపంలో తన ఇంటిపైనే పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దాంతో ఇంట్లో ఉన్న సిలిండర్ ఫ్రిడ్జ్, విలు వైన వస్తువులు కాలిపోయాయి. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నారాయణ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని నారాయణ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏజీఎం వికారాబాద్ జోన్ వెంకట వల్లి కుమార్, ప్రిన్సిపల్ లక్ష్మణ్,కో ఆర్డినేటర్ రాధికా వైస్ ప్రిన్సిపల్ సాయి తేజస్విని, ఈ కిడ్స్ జోనల్ కో ఆర్డినేటర్ వనిత, ఏవో అజయ్ చేతులమీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణోత్సవానికి మంత్రి దామోదర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేటలోని పబ్బతి హనుమాన్ దేవాలయ ఆవరణలో నేడు(బుధవారం) జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆహ్వాన పత్రికను అందజేశారు. సంగారెడ్డిలోని ఆయన నివాసంలో అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో పూజారి లక్ష్మణరావు తదితరులు మంత్రిని కలిసి.. సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు కూడా ఆహ్వాన పత్రికను అందించారు. స్థానిక వీర హనుమాన్ దేవాలయంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి హాజరుకావాలని వేరువేరుగా ఆలయ పూజారి దత్తు పంతులు ఆధ్వర్యంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఆయన వెంట 12వవార్డు కౌన్సిలర్ నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు రఘు, శ్రీనివాస్, రవి తదితరులు ఉన్నారు.

ఎండి. సర్దార్ కుటుంబానికి సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ-సంగారెడ్డి

పీఏసీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, మెదక్ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎం.డి సర్దార్ తల్లి హలీమాబి అనారోగ్యంతో రేగోడ్‌లో మృతి చెందింది. దాంతో సర్దార్ కుటుంబానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరఫున కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-జిన్నారం

పటాన్చెరు నియోజకవర్గంలో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు మద్దతుగా మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు జిన్నారం మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. తరలి వెళ్లిన వారిలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నాయికోటి కోటి రాజేష్, సోషల్ మీడియా అధ్యక్షులు భీమ్రావు, మాజీ సర్పంచులు పులిగిల్ల ప్రకాశం చారి ఆంజనేయులు, ఖదీర్, జనార్దన్ శెట్టి శివరాజ్, రేఖ కృష్ణ ఎంపీటీసీలు స్వాతి ప్రభాకర్ రెడ్డి, భార్గవ్, బత్తుల సంతోష్ మహేష్, నాయకులు కుమ్మరి కృష్ణ, రమేష్, భాస్కర్ జిన్నారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్ల సంఖ్య పెంచాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

వేసవి దృష్ట్యా బొల్లారంలోని నీటి ట్యాంకర్ల సంఖ్య పెంచాలని.. మున్సిపల్ ఉచిత నీటి సరఫరా అని అందరికీ తెలిసేలా ట్యాంకర్లపై రాయాలని రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్‌లో మూడు నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేశారని.. అయితే కొన్ని చోట్ల నీటిని ట్యాంకర్ల డ్రైవర్లు డబ్బులకు అమ్ముతున్నారన్నారు. అది ప్రయివేటు ట్యాంకరా, మున్సిపల్ ట్యాంకర్లా ప్రజలకు తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నదన్నారు. కాబట్టి మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి.. నీటి ట్యాంకర్ల సంఖ్య పెంచి, ఉచిత నీటి సరఫరా అని ట్యాంకర్లపై రాయించాలని విజ్ఞప్తి చేశారు.



బీఆర్ఎస్ సభకు తరలిన పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-కోహిర్

మండలంలోని బిలాల్పూర్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున సుల్తాన్‌పూర్ బీఆర్ఎస్ సభకు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కే నరసింహులు, మాజీ సర్పంచ్ ఖలీల్, ఎం నర్సింహులు, నాయకులు విట్టల్ రెడ్డి, అంజయ్య రాజు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్ : ప్రజా ఆశీర్వాద సభకు మండల పరిధిలోని న్యాల్కల్, మామిడ్గితో పాటు పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, నరసింహారెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, పడకంటి వెంకట్, వసీం, మాజీ సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

నేడు సీతారాముల కళ్యాణోత్సవం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని బాలాజీనగర్‌లో గల శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని నేడు(బుధవారం) శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ మహోత్సవాన్ని ఉదయం 10:00 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాబట్టి భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని.. స్వామి వారి తీర్థప్రసాదాలు మరియు అన్నదానం స్వీకరించాలని కోరారు.

జిన్నారంలో నేడు రాములోరి కళ్యాణం

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారంలో గల స్థానిక కోదండ రామాలయంలో శ్రీరామ నవమి పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాములోరి కల్యాణానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బురెడ్డిగారి భోజిరెడ్డి మంగళవారం తెలిపారు. వైభవోపేపతంగా జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు, నాయకులు అన్ని వర్గాల ప్రజా సమూహం పెద్ద ఎత్తున హాజరై నిజం పెంచాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లోకి మాజీమంత్రి ఫరీదొద్దీన్ తనయుడు

- అనుచరగణంతో సీఎం సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న తన్వీర్..
- మరోమారు చక్రం తిప్పిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ నియోజకవర్గంలోని మాజీ మంత్రి కీర్తిశేషులు మహమ్మద్ ఫరీదోద్దీన్ తనయుడు, టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్‌తో పాటు ఆయన అనుచరగణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీని జహీరాబాద్ నియోజకవర్గంలో బలపరిచేందుకు గత కొన్ని రోజులుగా మంత్రి దామోదర్ రాజనర్సింహ చేస్తున్న కృషి ఫలించింది. తన్వీర్ తన అనుచరులతో కలిసి భారీ సంఖ్యలో జహీరాబాద్ పట్టణం నుంచి కాన్వాయ్‌గా ఏర్పడి హైదరాబాద్ బయలుదేరి వెళ్లి.. ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు కిషన్ పవర్ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మొగుడంపల్లి నాయకులు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ మహంకాళి శుభాష్, నాయకులు వైద్యనాథ్, భాసిట్, మైపాల్ రెడ్డి పుణ్యమ్మ, నాగేష్, రాములు నేత, మోతిరాం, నారాయణరెడ్డి, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ యూనూస్, నసీర్, ఖాదర్‌లతోపాటు నియోజకవర్గంలోని ఝరాసంఘం, కోహిర్, న్యాల్కల్, మొగుడంపల్లి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, మాజీ ఎంపీ సురేష్ షెటర్, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్తేజం..

జహీరాబాద్ పట్టణంలో బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో.. మహమ్మద్ తన్వీర్, తాజా మాజీ కౌన్సిలర్ల రాకతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వచ్చింది. అంతేకాకుండా మైనార్టీ వర్గానికి చెందిన ప్రముఖులతోపాటు తాజా మాజీ కౌన్సిలర్లు మెజారిటీ స్థాయిలో కాంగ్రెస్‌లో చేరడంతో.. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్‌కు ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీ లభిస్తుందని ఆ పార్టీ నాయకులు ఆశిస్తున్నారు.



కాంగ్రెస్‌లోకి ఇస్మాయిల్ సాబ్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నాగలిగిద్ద మండలం కరస్గుత్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఇస్మాయిల్ సాబ్ నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమాలకు ఆకర్షితులై పార్టీ లో చేరినట్టు ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ కుమార్ శెట్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో కలవడానికి సహకరించిన అంబేద్కర్ పూలే సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.పండరీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తనకు పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డికి, సురేష్ కుమార్ శెట్కర్‌కు, పీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.



మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లోకి సయ్యద్ షకీల్

నవతెలంగాణ-న్యాల్‌కల్

హైదరాబాద్‌లోని జూబ్లీ రీచ్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కర్ సమక్షంలో ముంగి గ్రామానికి చెందిన సయ్యద్ షకీల్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. న్యాల్కల్ మండలంలో వరసుగా కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతుండడంతో.. కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తున్నది. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని షకీల్‌కు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, సయ్యద్ షకీల్, గౌస్, రఫీయొద్దీన్ నాయకులున్నారు.

కాలుష్య కోరల్లో పారిశ్రామిక వాడలు

- ఘాటైన వాసనాలతో స్థానికుల ఉక్కిరిబిక్కిరి
- ధనార్జనే ధ్యేయంగా పరిశ్రమల యాజమాన్యాలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కాలుష్య కోరల్లో పారిశ్రామికవాడలు విలవిలలాడుతున్నాయి. రాత్రి వేళల్లో ఘాటైన వాసనలతో స్థానిక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బొల్లారం, ఖాజిపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి, గుమ్మడిదల పారిశ్రామిక వాడల్లో నిత్యం వివిధ రసాయన పరిశ్రమల్లో కాలుష్య వ్యర్థ జలాలను రాత్రి వేళల్లో వివిధ ఔట్‌లెట్ ద్వారా బయటకు వదులుతున్నారు. మరికొన్ని పరిశ్రమల్లో రసాయన వ్యర్థ జలాలను రాత్రి వేళల్లో ప్రయివేటు ట్యాంకర్ల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంకొన్ని పరిశ్రమలు వాయు కాలుష్యం విడుదల చేస్తుండటంతో.. ఘాటైన వాసనలతో స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రసాయన పరిశ్రమల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారాజ్యంగా వ్యర్థాలను వదులుతున్నారు. అంతేగాకుండా రాత్రి వేళల్లో ట్యాంకర్లు ద్వారా గుట్టు చప్పుడుగా చెరువులు, కుంటల్లో వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానికులు ఎవరైనా వ్యర్థ జలాలను బయటకు వదులుతున్నారని పిసీబీ అధికారులకు పిర్యాదు చేస్తే.. నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోవటం లేదని చెబుతున్నారు. దాంతో పరిశ్రమల యాజమాన్యాల తీరులో మార్పు రావడం లేదన్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు స్పందించి కాలుష్యం వెదజల్లే పరిశ్రమలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన ప్రకాష్ రాథోడ్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మాజీ ఎంపీ సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో బీఎంపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రాథోడ్ మంగళవారం 1500 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి, సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ప్రకాష్ రాథోడ్, సురేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, వినోద్, రవి నాయక్, రమేష్, నారాయణ, నగేష్, గోపాల్, మోహన్, ప్రేమ్ రాజు, సర్దార్ వివిధ తాండాల ప్రజలు ఉన్నారు. కాగా ప్రకాష్ రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణ పేరుతో రాష్ట్ర కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. అలాగే దేశ ప్రజలను కూడా మోడీ మోసం చేశారని.. కాబట్టి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలపించాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎస్టి సెల్ ప్రెసిడెంట్ నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని రాంరెడ్డిబావి బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకులు, యువకులు కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాటా శ్రీనివాస్ గౌడ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామన్నారు. కొత్త పాత అనుకోకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, మద్ది ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులు, బాలకృష్ణ, కో-ఆపరేటివ్ వైస్ చైర్మన్ సామల దయాకర్ రెడ్డి, వార్డు సభ్యులు నర్సింలు, మైపాల్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అంతిరెడ్డి, వడ్ల సత్యనారాయణ, శ్రీపాల్ రెడ్డి, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

బొల్లారంలో ఆనంద్ కృష్ణారెడ్డి ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా బొల్లారం మున్సిపల్ టౌన్ బీజేపీ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డ్ వినాయక నగర్ కాలనీలో రఘునందన్‌రావుకు మద్దతు కోరుతూ ఇంటి ఇంటికి వెళ్లి ప్రచారం చేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ఓటు వేసి.. మోడీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన రోడ్లు..

- పట్టించుకోని అధికారులు, నాయకులు
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని యువకుల నిరసన



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మనూర్ మండలంలోని నదిగడ్డ హుక్రాణ నుంచి అతిమ్యాల్ వరకు పూర్తిగా రోడ్డు ధ్వంసమైనా అటు అధికారులు గానీ, ఇటు రాజకీయ నాయకులు గానీ పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ యువజన సంఘాల నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. వారానికి రెండు మూడు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు గానీ ఆస్పత్రికి గానీ వెళ్లాలంటే ఈ గుంతల రోడ్డే దిక్కు అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచి స్విమ్మింగ్ పూల్‌ను తలిపిస్తున్నదని ఎద్దేవా చేశారు. ఇలాంటి రోడ్లపై రాత్రిపూట ప్రయాణాలు మరీ ప్రమాద కరంగా మారుతున్నాయన్నారు. అంబులెన్స్‌లు కూడా గ్రామానికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రజలు ఇన్ని ఇబ్బందు లు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడని మండి పడ్డారు. రాజకీయ నాయకులు ఓట్ల సమయానికి వచ్చి పోతున్నారు తప్పా.. ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరిం చకుం టే.. ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు రాజకీయ నాయకు లను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నిరసనలో గోపాల్, భవాని ప్రసాద్, సతీష్ , పాండు, ప్రవీణ్, నగేష్, నర్సింలు, సందీప్, శ్రీకాంత్, మహేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రత్నాపూర్ గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోడీని మరోసారి ప్రధాని చేయాలన్నారు. అందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్‌ను గెలిపించాలన్నారు. ఆయన గెలిస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందంటూ ప్రచారంలో ప్రజలకు వివరించారు.



మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



నవతెలంగాణ-కల్హేర్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నారాయణఖేడ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. నిజాంపేట మండలంలోని తన స్వగ్రామమైన బాచేపల్లి గ్రామ యువకులకు ఫుట్ బాల్ కిట్‌ను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువకులు చదువులలోనే కాకుండా ఆటలు ఆడి ఆటల్లో కూడా మంచి ప్రతి భ చూపి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆటలం ఆడడం వల్ల మానసిక ఉల్లా సంతో పాటు ఆరో గ్యంగా ఉంటామని.. అందుకే తన వంతు సాయం గా ఫుట్ బాల్ కిట్‌ను అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభ కు తరలిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ పెద్ద శంకరంపేట్: సంగారెడ్డి జిల్లా సుల్తాన్ పూర్ లో నిర్వహిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు పెద్ద శంకరంపేట నుండి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అధిక సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల నుండి ప్రత్యేక వాహనాలలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సభకు తరలి వెళ్లారు. పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ పేట జడ్పిటిసి విజయరామరాజు ఆయా గ్రామాల నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ- కొల్చారం: సంగారెడ్డి జిల్లా సుల్తాన్పూర్ సమీపంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు కొల్చారం మండలం నుండి బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. తుక్కాపూర్ గ్రామం నుంచి మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ దొడ్డే ఆంజనేయులు, సీనియర్ నాయకుడు శివప్పగారి శ్రీశైలం ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్యకర్తలు తరలి వెళ్లినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందని చెప్పారు. కెసిఆర్ హయాంలో సాగు, తాగునీటి ప్రాజె క్టులు నిర్మాణాలు చేపట్టడం చారిత్రాత్మకమని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కరువు కాలం ప్రారంభమైందని కరెంటు కోతలతో పాటు గ్రామాల్లో నీటి కొరతా ఏర్పడిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు రవీందర్ కార్యకర్తలు ఉన్నారు.

మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయి అంతర కళాశాలల పోటీలో ప్రథమ బహుమతి



నవతెలంగాణ-మెదక్‌టౌన్

ఈనెల 4 వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలలో మన కళాశాలకు చెందిన విద్యార్థులు జానపద బృంద గానంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు శ్రీధర్ నాయకత్వంలో విద్యార్థులు మనోజ్ఞ ,విద్య, స్వాతిక, రమణి, కృపలత అను విద్యార్థులు ఈ పోటీలో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, సాంస్కృతిక విభాగ ఇన్చార్జి డాక్టర్ వామన మూర్తి, అధ్యాపకులు వేణుగోపాల శర్మ, డాక్టర్ అరుంధతి, డాక్టర్ జ్ఞానానందం విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈనెల 26వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకోనున్నారని తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని, విద్యార్థులకు ఆదర్శమని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కోలపల్లి చెక్‌పోస్ట్ వద్ద 2 లక్షల రూపాయలు పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ పెద్ద శంకరంపేట్

161వ జాతీయ రహదారి పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి చెక్ పోస్ట్ వద్ద మంగళవారం పేట ఎస్సై శంకర్ రెండు లక్షల రూపాయల నగదును పట్టుకున్నారు. మహారాష్ట్ర నాందేడ్ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న షేక్ సమీర్ వాహనంలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రెండు లక్షల రూపాయలు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ డబ్బులను సంగారెడ్డి గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద శంకరంపేటలో సిఐఎస్ఎఫ్ పోలీసులతో కవాతు..



నవతెలంగాణ పెద్ద శంకరంపేట్

పార్లమెంట్ ఎన్నికల కోడ్ లో భాగంగా మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశానుసారం మంగళవారం మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట లో మరియు బూరుగుపల్లి గ్రామంలో అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో సిఐఎస్ఎఫ్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఆయా గ్రామాలలో పోలీస్ కవాతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి నుంచి భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ - నార్సింగి

మైనంపల్లి ఫంక్షన్ హాలు చేగుంట లో ఏర్పాటు చేసిన నార్సింగి, చేగుంట ఉమ్మడి మండలాల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి నార్సింగి నుంచి బీఆరెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఎంపీపీ చిందం సబితా రవీందర్, జెడ్పీటీసీ బానాపురం కృష్ణా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు ల అధ్యక్షతన మండల వ్యాప్త గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు, యువకులు సమావేశానికి భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈ సారి కూడా మెదక్ పార్లమెంట్‌లో బీఆరెస్ జెండా ఎగరడం ఖాయమని, భారీ మెజార్టీ తథ్యమని పార్టీ కార్యకర్తల, నాయకుల, యువకుల ఉత్సాహాన్ని చూస్తే అర్థం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత శంకర్, ఎంపీటీసీ సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేష్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అంచనూరి రాజేష్, పట్టణ కార్యదర్శి భూపతి రాజు, మైనారిటీ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

ఉమ్మడి చేగుంట మండలం చెట్ల తిమ్మాయపల్లి గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ బాలకృష్ణ కుమారుడు అఖిల్ సోమవారం తూప్రాన్ మండలం నాగులపల్లి చౌరస్తా రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి నేనున్నానంటూ భరోసా కల్పించారు. గ్రామ మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, ఎంపిటిసి హెచాలీ నాయక్, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, నాయకులు హలవత్ శ్రీనివాస్, వీరి వెంటే ఉన్నారు.

నాయకులు పోయినంతమాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం లేదు

- కాంగ్రెస్ లోకి వెళ్లిన వారంతా అవినీతి ఆరోపణలు ఉన్నవారే
- మదన్ రెడ్డి పార్టీ మారడం ఆయన వ్యక్తిగతం
- వెంకట్రామిరెడ్డికి అధిక మెజార్టీ అందిస్తాం : ఎమ్మెల్యే సునీతా రెడ్డి



నవ తెలంగాణ -నర్సాపూర్

నాయకులు పోయినంతమాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం లేదని గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీకి బలమైన కార్యకర్తలు ఉన్నారని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ స్వార్థం కోసం కొందరు నాయకులు పార్టీ వీడారని అటువంటి వారి వల్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదన్నారు. గ్రామాలలో తమ పార్టీకి బలమైన కార్యకర్తలు ఉన్నారని అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఎంతో కష్టపడ్డారని అదే స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో బి ఆర్ ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించేందుకు కృషి చేస్తామని తమతో కార్యకర్తలు చెబుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీని వీడిన వారంతా అవినీతి ఆరోపణలు ఉన్నవారేనని వారి వల్ల పార్టీకి నష్టం కంటే మేలే జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పార్టీని వీడడం ఆయన వ్యక్తిగత విషయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తూ బి ఆర్ ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భోగచంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, సూరారం నరసింహులు తదితరులు పాల్గొన్నారు

వంద కోట్లతో ట్రస్ట్ పెట్టి ప్రజాసేవ చేస్తా...

- ఎమ్మెల్సీ, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- గులిచే దమ్ములేకనే వెంకట్రామిరెడ్డిపై రఘునందన్ ఆరోపణలు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

రూ, 100 కోట్లతో వెంకట్రాంరెడ్డి ట్రస్టు ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తానని, వెయ్యి కుటుంబాలకు ఆశ జ్యోతిగా ఉండాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్సీ, పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి అన్నారు. చేగుంట మండలం వడియారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం మెదక్ పార్లమెంట్

చేగుంట, నార్సింగి మండలాల విస్తతస్థాయి కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ, పి. వెంకట్రామరెడ్డి తో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు..అబద్ధాలు చెప్పి మోసం చేసిన రఘునందన్ కు ఓటమి భయం పట్టుకుందని, భయంతోనే వెంకట్రామరెడ్డి పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రభాకర్‌రెడ్డి మండి పడ్డారు..ఎన్నికల్లో గెలిచే దమ్ము లేక వెంకట్రామరెడ్డి ని అరెస్టు చేయాలని, కేసులు పెట్టాలని మాట్లాడుతున్నారని, దుబ్బాక ప్రజలను మోసం చేసిన నీపైనే కేసులు పెట్టాలన్నారు..అక్రమాలకు పాల్పడే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని అన్నారు. తాను ఎంపీ గా మెదక్ పార్లమెంటు కోసం ఎంతో అభివద్ధి చేయడం జరిగిందని, ఫ్లై ఓవర్లు, అండర్ పాసింగ్ నిర్మాణాలు, జాతీయ రహదారి అభివృద్ధి, సిద్దిపేట, మెదక్ లకు రైలు సౌకర్యం, సిద్దిపేట కు కేంద్రీయ విద్యాలయం తీసుకు రావడం జరిగిందన్నారు.420 హామీలతో అధికారంలోకి వొచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందన్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కు అన్యాయం చేసిందన్నారు..సిద్దిపేట అభివద్ధి లో కలెక్టర్ గా వెంకట్రామరెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు.ఎంపీ గా గెలిపించి పార్లమెంటు కు పంపిద్దామన్నారు..దుబ్బాక అభివృద్ధి లో వెంకట్రామరెడ్డి కీలక పాత్ర పోషించడం ఖాయమన్నారు.100 కోట్లతో ఏర్పాటు చేసే ట్రస్టు ద్వారా యువతీ, యువకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు... పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ, పార్లమెంట్ అభ్యర్థి పి. వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో గెలిచే సత్తా లేకనే నాపై బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ గా నా పనితీరు ప్రజలకు తెలుసని, ఓర్వలేని రఘునందన్ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉంది అనే ఉద్దేశంతో నామీద కేసులు పెడుతున్నారన్నారు. రఘునందన్ నామీద కలెక్టర్ కు, ఎస్పీ కి, ఈడీ, సీబీఐ, ఎన్నికల కమీషన్ కు పిర్యాదు చేసారని, ఇంకా ఏమైనా చేసుకో, తెల్ల పేపర్ లాంటి నేను భయపడేది లేదన్నారు.. మాయ మాటలు చెప్పే వాళ్ళను దుబ్బాక నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని, వాస్తవాలు చెప్పే వారికే పట్టం కట్టాలని కోరారు. నెల రోజుల్లో 7 నియోజకవర్గంలలో ట్రస్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి శిక్షణ కోసం కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి జాబ్ మేళా ఏర్పాటు చేసి అండగా ఉంటామన్నారు.దుబ్బాక యువతకు ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తో కలిసి వెన్నుదన్నుగా ఉంటామని, సిద్దిపేట, గజ్వేల్ తరహాలో అభివద్ధి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర రావు, రొట్టె రాజమౌళి పంతులు, సోలిపేట సతీష్ రెడ్డి, వెంకట నర్సింహ రెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు కోమండ్ల నారాయణరెడ్డి, నార్సింగ్ మండల అధ్యక్షులు మైలారం బాబు, జడ్పీటిసిలు శ్రీనివాస్, బాణపురం కష్ణా రెడ్డి, ఎంపీపీ చిందం సబిత, వైస్ ఎంపీపీ సుజాత, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు రహీమోద్దీన్, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ తిరుమల నర్సింలు, ఎంపీటీసీ బక్కి లక్ష్మీ రమేష్, మండల సర్పంచ్ ల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, రైతు బంధు జిల్లా డైరెక్టర్ మోహన్ రెడ్డి,సొసైటీ చైర్మన్ లు కొండల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, రాజగోపాల్, సుభాష్ రెడ్డి, శ్రీ పతి రావు, వెణుపంతులు, సుభాశ్ రెడ్డి పట్నం తానిషా ,తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-మెదక్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, ఖర్చుల రిజిస్టర్ ల నిర్వహణ, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...18 వ తేదిన నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 25 వ తేదీన నామినేషన్ల స్వీకరణ ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఏప్రిల్ 25వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు వేయాలన్నారు. కార్యాలయ పని దినాల్లో ఏప్రిల్ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 03 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 26వ తేదీన నామినేషన్ ల స్క్రూటిని, 29న నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు అని తెలిపారు. మెదక్ పార్లమెంట్ సంబంధించి అన్ని కలిపి మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల సౌకర్యార్థం నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ దాఖలుకు ముందు అభ్యర్థులు తమ నామినేషన్లను హెల్ప్ డెస్క్ లో చెక్ చేయించుకోవాలన్నారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు నామినేషన్ సెట్లను దాఖలు చూసేందుకు అవకాశం ఉందన్నారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితో పాటు 5 గురికి (1+4) మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఫారం -6 ద్వారా సమర్పించే అఫిడవిట్ లో అన్ని ఖాళీలు పూరించాలన్నారు. నామినేషన్ సమయంలో క్రిమినల్ కేసులు, కన్విక్షన్ కేసుల వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా లో 3 సార్లు పబ్లిష్ చేయాలన్నారు. అభ్యర్థులు కొత్త ఖాతా తెరిచి దాని నుంచే చెల్లింపులు జరపాలన్నారు.

నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం నుండి కేవలం 3 వాహనాలనే అనుమతిస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి



నవతెలంగాణ - దౌల్తాబాద్

భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. శ్రీరామ నవమి సందర్భంగా ఇందుప్రియాల్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. బ్రహ్మోత్సవాల్లో వివిధ మండలాల నుండి అత్యధికంగా భక్తులు వస్తుండడంతో ఇందుప్రియాల్ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది ఇందులో భాగంగా నిత్య పూజలతో పాటు ఈ రోజు ఉదయం 11 గంటలకు వేద బ్రాహ్మణ పండితుల మంత్రోత్సవాలతో భక్తుల జయ జయ ధ్వనుల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయకమిటి నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 21న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవ కార్యక్రమం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఏప్రిల్ 22 వరకు జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం

ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ అన్నారెడ్డిగారి సుభాష్ రెడ్డి

ఇందుప్రియాల్ గ్రామంలో నేటి నుండి 22 వరకు నిర్వహించే సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరై భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశాం. తాగునీటి సౌకర్యం,చలువ పందిళ్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశాం. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి.

సివిల్స్ లో బుద్ధి అఖిల్ కు 321వ ర్యాంకు



నవతెలంగాణ-కొండపాక

సివిల్ సర్వీసెస్ పరీక్ష 2024 జనవరిలో నిర్వహించగా అట్టి ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో కొండపాక మండల కేంద్రానికి చెందిన బుద్ధి నరేష్ లలిత ల పెద్ద కుమారుడు బుద్ధి అఖిల్ యాదవ్ జాతీయ స్థాయిలో 321 ర్యాంకు సాధించాడు.అఖిల్ 1నుండి7తరగతి వరకు కొండపాక లోని సాయి పబ్లిక్ స్కూల్, 8నుండి 10 తరగతి వరకు సిద్దిపేట లోని రవీంద్ర హైస్కూల్,ఇంటర్ సిద్దిపేట లోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో , ఇంజనీరింగ్ విద్య కాకతీయ విశ్వవిద్యాలయం లో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. అనంతరం స్వంతంగా ప్రిపరేషన్ అయి 2024జనవరిలో పరీక్ష రాయగా సోమవారం విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో 321వ ర్యాంకును సాధించడం జరిగింది. బద్ధి అఖిల్ మెదటి రెండు ప్రయత్నాలలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు తర్వాత 2021 లో 566 ర్యాంక్ పోంది ఐపిఎస్ గా ఎన్నికై ట్రైనింగ్ తీసుకున్నాడు. ఐఎఎస్ సాధించాలని మెక్కవోని పట్టుదలతో ప్రయత్నించి జాతీయ స్థాయి లో 321వ ర్యాంక్ రావడంతో వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

నామినేషన్లకు సర్వం సిద్ధం..

- ఈనెల 18 నుంచి 25 వరకు స్వీకరణ
- ఎన్నికల కోడ్ మరింత కట్టుదిట్టం
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ - మెదక్

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచందర్ రాజు లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 18న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాబోతుందని, ఈ నెల 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ ఆఫీసర్ వద్దకు అభ్యర్థి వెంట ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలతో పాటు ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యా అర్హత వివరాలు పత్రాలను దాఖలు చేయాలన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి దాఖలుకు ఒకరోజు ముందు కొత్త బ్యాంక్ అకౌంట్ చేసి ఈసీ కి వెల్లడించాలని తెలిపారు. కొత్త బ్యాంక్ అకౌంట్ లోనే అభ్యర్థి ఖర్చు వివరాలను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. జనరల్ అభ్యర్థులు రూ. 25 వేలు, ఎస్సీ అభ్యర్థులు రూ. 12,500 చెక్, చలానా రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలన్నారు. రిజర్వుడ్ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్‌తోపాటు కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ధ్రువపత్రాలు అందుబాటులో లేకుంటే స్క్రూటీని సమయానికి ఆర్వో కార్యాలయంలో వాటిని అందజేయాలన్నారు. ఈనెల 26న నామినేషన్ల స్క్రూటినీ, 29 వరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పిస్తారన్నారు. పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారన్నారు. 15 రోజుల పాటు అభ్యర్థుల ప్రచారాల తర్వాత మే 13న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపును చేపట్టి గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో నామినేషన్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను, నామినేషన్ పత్రాలు అందించే కౌంటర్లను, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్లను, కంట్రోల్ రూంలను, హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అప్లికేషన్ సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాల పై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి కాపీలను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఒకరోజు ముందే అభ్యర్థి తన పేరున ఎన్నికల ఖర్చు కోసం కొత్తగా బ్యాంకు ఖాతాను ప్రారంభించి ఖాతాకు సంబంధించిన వివరాలను ఆర్వో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ వేసే గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒక ప్రతిపాదకుడిని, ఇండిపెండెంట్లు, రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు పదిమంది ప్రతిపాదకుల సంతకాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతిపాదకులు సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలన్నారు. ప్రతిపాదకులు నిరక్షరాస్యులైన పక్షంలో ఆర్వో సమక్షంలోనే వేలిముద్ర వేయాల్సి ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోపు ఒక్కో అభ్యర్థికి సంబంధించిన 3 వాహనాలను అనుమతిస్తారు. నామినేషన్ కేంద్రాలలోకి 3 వాహనాలకు అభ్యర్థితో సహా ఐదుగురికే అనుమతి ఉంటుందన్నారు. ప్రతిరోజు సాయంత్రం 3 గంటల తరువాత రోజువారీ నామినేషన్ వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. సువిధా యాప్ ద్వారా నామినేషన్ దాఖలు కు ఎన్నికల సంఘం సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఆన్లైన్ లో దాఖలు తరువాత పత్రాలను ఆర్వో కు అప్పగించాలన్నారు. ప్రతిరోజు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడేవిట్ పత్రాలను డిస్ప్లే చేయనున్న తెలిపారు. నామినేషన్ దాఖలు చేసిన ప్రతి అభ్యర్థి అఫిడవిట్ పత్రాలను 24గంటల్లోనే సీఈఓ వెబ్సైట్‌లో పెట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ నుంచి కోడ్ మరింత కట్టుదిట్టం అవుతుందని తెలిపారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యం, ఇతర కానుకలతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు జరిగే ప్రయత్నాలను అడ్డుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లాలో వీడియో నిఘా బృందాలు, వీడియో వ్యూయింగ్ టీమ్ లు, అకౌంటింగ్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వెలియన్స్ లో ఖర్చుల పర్యవేక్షణ బృందాలు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాయని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. రూ. 50 వేల కు పైగా డబ్బులు తీసుకెళ్తే దానికి సంబంధించిన పత్రాలు ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 19 వ్యక్తుల వద్ద నుండి రూ. 28, 89 లక్షల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. కమిటీలో 13 అప్లికేషన్ రాగా 11 అప్లికేషన్లకు సంబందించి రూ. 15 లక్షల ను రిలీజ్ చేయడం జరిగిందన్నారు. ఆయా రాజకీయ పార్టీల పై 4 కేసులు ఎఫ్ఐఆర్ అయ్యాయని తెలిపారు. అలాగే రూ. 93 లక్షల విలువ చేసే 98,490 లీటర్ల లిక్కర్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. 102 ఎక్సైజ్ కేసులు బుక్ చేశామన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు మొత్తంగా రూ.95 లక్షలు మాత్రమే ప్రత్యేక బ్యాంక్ ఖాతా ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి దగ్గర రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు ఉండకూడదని, ఖర్చులన్నీ ఆన్ లైన్ ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గుతుందని, ఆ శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెంట్ హర్దీప్ సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ట్రేనర్స్‌ను ఎన్నికల విధుల నుండి తొలగించాలి

- డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గ ఎన్నికల విధులలో గత 2014 నుండి నేటి వరకు ఎన్నికల మాస్టర్ ట్రేనర్స్ గా విధులు నిర్వర్తించిన అధికారులను వెంటనే మార్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం అయన మాట్లాడుతూ అధికారులను మార్చాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్, సిద్దిపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట కలెక్టర్ గా వెంకట్రామిరెడ్డి విధులు నిర్వర్తిస్తున్న సమయంలో హరీశ్ రావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉండే, పార్టీకి అనుబంధంగా పనిచేసే కొంతమంది ఉద్యోగులను ఎన్నికల మాస్టర్ ట్రేనర్స్ గా నియమించారన్నారు. అప్పటినుండి నేటి వరకు ప్రతి ఎలక్షన్ లో వీరే ఎన్నికల విధులు నిర్వర్తించారన్నారనీ, ప్రతి ఎన్నికల్లో వీరు బిఆర్ఎస్ పార్టీకి, మాజీ మంత్రి హరీశ్ రావుకు అనుకూలంగా పనిచేశారని మండిపడ్డారు. గడిచిన గత రెండు ఎన్నికల్లో సిద్దిపేటలో హరీశ్ రావుకు అనుకూలంగా మెజార్టీ ఓట్ల కోసం రిగ్గింగ్ కు బి ఆర్ ఎస్ నాయకులకు సపోర్ట్ చేశారన్నారు. గతంలో హరీష్ రావు కు వచ్చిన లక్ష ఓట్ల మెజారిటీ వీరి ద్వారా, వీరి సహాయంతో రింగింగ్ చేసినవే అని ఆరోపించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ లో కూడా అవకతవకలకు, దొంగ ఓట్లకు సహకరించినట్లు తెలిసిందన్నారు. గోప్యంగా ఉంచాల్సిన ఎన్నికల అధికారుల వివరాలు ఎప్పటికప్పుడు హరీశ్ రావుకు ,బిఆర్ ఎస్ నాయకులకు తెలియజేసినట్లు ఆరోపించారు. ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా రిగ్గింగ్ కు పాల్పడకుండా ఉండాలంటే గతంలో నుండి ఎన్నికల్లో పనిచేసిన అధికారులను వెంటనే తొలగించి, ఎన్నికలు సజావుగా సాగే విధంగా చూడాలన్నారు .ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు మహేందర్ యాదవ్, పరశురాం, రాజు, జయంత్, గణేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
బుధవారం | 17 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-మద్దూరు

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకొని అధిక లాభాలు పొందాలని మద్దూరు ఏఈఓ రాకేష్ కోరారు. ఈ సందర్భంగా మండలంలోని నర్సాయపల్లి, గాగిల్లాపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని పంట పొలాల వద్ద ఆరబెట్టుకొని 17శాతం తేమ మించకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని ఆయన కోరారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా బుక్కును సెంటర్ నిర్వాహకులకు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-మర్కుక్

ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెసు. కుల, మతాలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ అన్నారు.మంగళవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.మెదక్ కిల్లా మీద బీఆర్ఎస్ జెండా ముచ్చటగా మూడో సారి ఎగర వేయడం ఖాయమన్నారు.కాంగ్రెస్ హయాంలో ప్రజల కష్టాలు పెరిగాయని వీటినే ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.ఆరు గ్యారంటీలలో ఒకటో, రెండో అమలు చేసి గొప్పలు చెప్పడం కాదని, ఇచ్చిన హామిలను ఎప్పుడు చేస్తారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బిజెపి ప్రభుత్వం లో రాజ్యాంగానికి ప్రమాదం

- రాజ్యాంగ రక్షణ కోసం పోరాడే పరిస్థితి
- జేపీసీ ఆధ్వర్యంలో ర్యాలీ, అంబేద్కర్ విగ్రహానికి వినతి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని హుస్నాబాద్ తెలంగాణ జేపీసీ నాయకులు అన్నారు. మంగళవారం హుస్నాబాద్ లో తెలంగాణ జేపీసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ చైతన్య ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం ప్రజలు పోరాటం చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు . . పదేళ్ల కాలంలో ప్రధాని మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ఫ్లెక్సీ పై ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగానికి ప్రత్యామ్నాయంగా ఆర్ఎస్ఎస్ విధానాలను దేశంలో అమలులోకి తీసుకువచ్చేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మత ప్రాతిపదికన రాజరికపాలన కొనసాగించుటకు మతాన్ని ముందుకు తీసుకు వస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని రక్షించేందుకు ప్రజలు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేపీసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ , జేపీసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, బంక చందు, సారయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు



నవతెలంగాణ - మర్కుక్

బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్కుక్ మొర్సు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ కొండ పోశమ్మ ప్రాజెక్టులో భూములను కోల్పోయిన బాధితులను తడి గుడ్డతో గొంతుకోసిన వ్యక్తి అని ,పేద ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనత అప్పటి కలెక్టర్ ,బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రెడ్డికి దక్కిందన్నారు.అలాంటి వ్యక్తికి ఈ ఎన్నికలలో ప్రజలు ఓటుతో బుద్ధి చేప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మరో సారి ఓటర్లను నమ్మించి అమలు కానీ అమీలను ఇస్తున్నరని ఎద్దేవా చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీలలో ఐదింటిని నెరవేర్చిందని, కేవలం మహిళలకు 2500 రూపాయలు ఇచ్చే పథకం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆగిపోయిందన్నారు.మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించి, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధికి, సిఎం రేవంత్ రెడ్డికి కానుకగా మెదక్ సీటును ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన అందిస్తూ మరింత రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు.

అంబేద్కర్ ఆశయాన్ని అవమానపరించింది బీఆర్ఎస్సే

- బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆరోపణ
- ఎమ్మెల్యే కవ్వంపల్లిపై బీఆర్ఎస్ ఆరోపణల ఖండన



నవతెలంగాణ-బెజ్జంకి

ఏక చక్రాధిపత్యం,నియంతృత్వ దోరణి అవలంభిస్తూ అంబేద్కర్ ఆశయాన్ని అవమానపరిచింది మండల బీఆర్ఎస్ పార్టీయేనని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మంగళవారం ఆరోపించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,మండల కాంగ్రెస్ శ్రేణులపై మండల బీఆర్ఎస్ నాయకుడు చేసిన ఆరోపణలను లింగాల శ్రీనివాస్ ఖండించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని గుగ్గిల్ల,లక్ష్మీపూర్, గూడెం గ్రామాల్లో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాలావిష్కరణలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మండల బీఆర్ఎస్ నాయకులు ఏక చక్రాధిపత్యం చలాయించి ప్రతిపక్ష నాయకులనే విస్మరించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు.అందరి వాడైనా అంబేద్కరుడిని కొందరివాడుగా మార్చిన ఘనత బీఆర్ఎస్ నాయకులదని మర్చిపోయారని విమర్శించారు.దళిత సామాజిక వర్గానికి చెందిన మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దళితులంటే వివక్ష చూపే అగ్రవర్ణాలను అక్కున చేర్చుకుని అంబేద్కరుడి పేరుతో రాజకీయాలు చేశారని అసహనం వ్యక్తం చేశారు.తిమ్మాయిపల్లిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవాడాన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే కవ్వంపల్లిపై బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తుందని..అంబేద్కర్ పై అపారమైన గౌరవం ఉండడంతోనే నియోజకవర్గంలోని అల్గునూర్ చౌరస్తాతో పాటు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్ట్ చౌరస్తా వద్ద నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని నివాళులర్పించిన విషయాన్ని బీఆర్ఎస్ తెలుసుకోకపోవడం అవివేకమన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే,కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారి

- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మతో కలిసి వారు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు కలిగిన వడ్లను కొనుగోలు చేయాలని నిర్వాహకులకు వెల్లడించారు. రైతులు ధాన్యమును ఎండబెట్టి పూర్తిగా శుభ్రపరిచిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుక రావాలని పిలుపునిచ్చారు. దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నంగునూరు మండలంలో 19,049 ఎకరాలలో 10,630 మంది రైతులు వరి సాగు చేశారన్నారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో 24 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాలమాకుల సోసైటి ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 7 కేంద్రాలు, నంగునూరు సోసైటి ఆధ్వర్యంలో 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత, విస్తరణాధికారి అశోక్, ఐకెపి సిబ్బంది, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం



నవతెలంగాణ -గజ్వేల్

పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఉప్పల మెట్టయ్య, నాచారం డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాజీ కలెక్టర్ ఎమ్మెల్సీ వెంకట్రామరెడ్డి గజ్వేల్ ప్రజల కు అందుబాటులో ఉండి ఎన్నో సేవలు అందించినట్లు వారు గుర్తు చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి వెంకట్రామిరెడ్డి ఎంతో కృషి చేసినట్లు గజ్వేల్ ప్రజలు రుణపడి ఉన్నారని వారు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కృషితో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి చెందిందని వారు చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీ తీసుకురావడానికి ఆర్యవైశ్యులం కృషి చేస్తామని వారు చెప్పారు. అంతేకాకుండా పేద ప్రజల కోసం రూ 100 కోట్ల రూపాయలతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అందర్నీ ఆదుకుంటా అని చెప్పడం గొప్ప విషయం అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి వెంకటరామిరెడ్డిని గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు శేఖర్ గుప్తా, స్వామి తదితరులు ఉన్నారు.

భద్రాచల కల్యాణరాముని కరపత్రాలు, గోడ పత్రికలు

- ఆవిష్కరించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

భద్రాచల దేవస్థానంలో జరిగే సీతారాముల కళ్యాణ బ్రహ్మోత్సవాల సంబంధించిన కర పత్రాలను, గోడ పత్రికలను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కష్టాలయంలోని రామాలయంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భద్రాచలంలో ఈనెల 17నుండి మొదలుకొని 23వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరుగుతుందన్నారు. భద్రాచల దేవస్థానంలో రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు గుర్తించి భద్రాచలంలో జరిగే ప్రతి కార్యక్రమంలో కూడా రామకోటి సంస్థకు చోటు కల్పించడం, రామకోటి రామరాజు భక్తికి నిదర్శనం అన్నారు. గోటి తలంబ్రాల కార్యక్రమం కూడా అద్భుతంగా నిర్వహించినందుకు భద్రాచల దేవస్థానం ఘనంగా సన్మానించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాలయం అధ్యక్షులు యెలగందుల రామచంద్రం, దూబకుంట మెట్రాములు, ఉప్పల వెంకటేష్, అత్తెల్లి లక్ష్మయ్య, దూబకుంట ప్రభాకర్, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి

- మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి ఎమ్మెల్సీ వెంకట్రామరెడ్డి విజయానికి కృషి చేస్తామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులు బొగ్గుల చందు, అర్చన శివకుమార్, రహీముద్దీన్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్, మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు నాయకత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీ తీసుకొస్తామని ఆయన చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో వచ్చిన మెజార్టీ ఎక్కువగా తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్లమెంటు అన్ని స్థానాలను గెల్చుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలో ఒకటి రెండిటికీ పరిమితమైందన్నారు. కెసిఆర్ నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం తోపాటు మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని కేసీఆర్ వైపే ప్రజలు ఉన్నారని ఈ పార్లమెంటు ఎన్నికలు నిరూపిస్తాయన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని తెలంగాణ అభివృద్ధి చేసింది కేసీఆర్ మాత్రమేనని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ 14 సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమయ్యారని 10 సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఒక గుర్తింపు వచ్చేలా పరిపాలన చేసిన తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరే అని అన్నారు. అభివృద్ధి సాధ్యపడేది ఆ ప్రాంతం మీద పట్టు ఉండాలన్నారు. కాంగ్రెస్ బిజెపి ఓట్ల రాజకీయాల కోసం తప్ప అభివద్ధి ఎరగని పార్టీలు అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు కేసీఆర్ వైపు ఉన్నారని ఆయన చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ఇల్లు అందేలా అధికారులు కృషి చేస్తున్నారన్నారు.

బైరాన్‌పల్లి గ్రామపంచాయతీ ముందు గ్రామస్తుల నిరసన

- స్పెషల్ అధికారి,గ్రామ కార్యదర్శి, సిబ్బందిపై చర్యలకు డిమాండ్



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు. గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు పట్టించుకునే నాధుడే లేడని,స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామం అభివృద్ధిలో కుంటుపడుతుందని వారు అన్నారు. స్పెషల్ అధికారి ఇప్పటివరకు గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవని వారన్నారు. గ్రామంలో చెత్త చెదారంతో మురుగు కాలువలు నిండిపోయి ఉన్నాయని, అంధకారంలో గ్రామం ఉన్న సంబంధిత ఎలక్ట్రీషన్ లైట్లు వేయడం లేదని వారు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామపంచాయతీ పనులు చేయకుండా పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్నారని వారు ఆరోపించారు. సర్పంచుల పదవి కాలం ముగియడంతో స్పెషల్ అధికారుల పాలన ప్రభుత్వం తెచ్చి పాలన సాగిస్తున్నా అధికారుల చేతగానితనంతో గ్రామ అభివృద్ధి కుంటుపడుతుందని వారన్నారు. గ్రామంలో చెత్త సేకరించిన ట్రాక్టర్ డీజిల్ లేకపోవడంతో నడిరోడ్డుపై రెండు రోజులపాటు నిలిపివేసినట్లు వారు తెలిపారు. దీంతో మురుగువాసనతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని వారు తెలిపారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్పెషల్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బందిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి వివరణ కోరగా గ్రామంలో జరిగే దుర్గమ్మ పండుగకు గ్రామపంచాయతీ లైట్లు గుడి దగ్గర వేయాలని వారు కోరారని, తాను గుడికి లైట్లు ఇవ్వడం కుదరదని చెప్పడంతో కావాలని ఇలా చేస్తున్నారని అని తెలిపారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ చెత్తతో రెండు రోజులు నడిరోడ్డుపై నిలవలేద, ఒక్కరోజు పెట్రోల్ బంకులలో డీజిల్ లేకపోవడంతో చెత్తతో నిండి ఉన్న ట్రాక్టర్ నిలిచింది నిజమేనని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ ఎలక్ట్రీషన్ ను ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రజాప్రతినిధులే అందులో పెట్టించారని ఆయన తెలిపారు.గ్రామ అభివీద్ధి చురుగ్గా సాగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల గోడు

- త్రిబుల్ ఆర్ రోడ్డు మ్యాప్ ను మార్చాలి : నిర్వాసితులు డిమాండ్



నవతెలంగాణ- గజ్వేల్

త్రిబుల్ ఆర్ రోడ్డుకు మరోసారి భూములు కోల్పోతున్నామని గజ్వేల్ డివిజన్ రైతులు ఇటీవల రోడ్డుకి ఎక్కడమే కాకుండా రాష్ట్ర మంత్రి వెంకట్ రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. తమ భూములు ఇప్పటికే కొండ పోచమ్మ, మల్లన్న సాగర్, గజ్వేల్ రింగ్ రోడ్డుకు కోల్పోయినట్లు వారు మంత్రి దృష్టికి తీసుకుపోయారు. అలాట్మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయినా రైతుల్లో ఆందోళన తగ్గలేదు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుండి ఏమైనా సమాచారం వచ్చిందా వస్తే ఏ రూపంలో వచ్చింది. అడిగి తెలుసుకుంటున్నారు. భూ నిర్వాసితుల్లో కొందరి బాధలు వర్ణనాతీతం. ఇప్పటికే జలాశయాలు, రైల్వే నిర్మాణాల్లో తమ భూములను కోల్పోగా మరోసారి ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆ ర్ఆర్)కూ ఇవ్వాల్సి వస్తోంది. ప్రాంతీయ రింగు రోడ్డు ఉత్తర భాగం భూసేకరణ సిద్ధం కావడంతో ఈ మేరకు సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేశారు. భూమిని కోల్పోతున్న చాలా మంది రైతులు ప్రాజెక్టుల నిర్వాసితులు కావటంతో మరోసూరు భూములు కోల్పోవాల్సి వస్తుందని ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని తమ భూములను మినహాయించ టమో, మరోచోట భూమి లేదా మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వడమో చేయాలని ఇటీవల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి గోడు వెల్లబోసుకున్నారు. ముఖ్యమంత్రి దీష్టికి తీసుకెళ్లి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

గజ్వేల్ 980 ఎకరాల సేకరణ

రోడ్డు నిర్మాణానికి దాదాపు 5 వేల ఎకరాల వరకు సేకరించనున్నట్లు అంచనాకొచ్చారు. ఉత్తర భాగంగా దాదాపు 158 కిలోమీటర్ల పొడవు కలిగి ఉన్న రోడ్డు ఉమ్మడి మెదక్ జిల్లాలోనె దాదాపు 158 కిలోమీటర్ల మేర ఉంటుంది. అందుకు 100 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఇందుకోసం 4500 ఎకరాల భూమిని సేకరించనున్నారు ఆందోల్-జోగిపేట్ పరిధిలోకి 8.5 కిలోమీటర్ల గాను ఐదు గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. గజ్వేల్ పరిధిలో 32 కిలోమీటర్ల రోడ్డుకు అక్కడ 17 గ్రామల్లో తూప్రాన్ డివిజన్ పరిధిలోని28 కిలోమీటర్లకు 14 గ్రామాల్లో, సంగారెడ్డి పరిధిలో దాదాపు పది గ్రామాల మొత్తంగా 54 గ్రామాల పరి దిలో 4500 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఇందులో అత్యధికంగా 960 ఎకరాల భూమిని రోడ్డు నిర్మాణానికి తీసుకుంటున్నారు. ఈ ప్రాంతంలోని చాలా భూములను మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ తోపాటు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగురోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంలో నిర్వాసితులు కోల్పోయారు. వారు భూములను కానుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. త్రిబుల్ ఆర్ కోసం... త్రిబుల్ ఆర్ రోడ్ కోసం నిర్వాసితులు భూములు కోల్పోయే పరిస్థితి ఉంది. రెండోసారి నిర్వాసితులు కానున్నారు. స్థానికంగా ప్రస్తుతం ఎకరం భూమి రూ 3 కోట్లు, అతి తక్కువగా రూ 50 లక్షల వరకు ధరలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే పరిహారం తో పదో వంతు భూమైన వచ్చే అవకాశం లేదని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. బతుకులు అగమవుతాయని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని విన్నపాలు విని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికష్ణ



నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

ప్రతి కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు . మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం బచ్చాయిపల్లి వార్డ్ మెంబర్లు కుల సంఘ పెద్దలు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంప్ ఆఫీసులో శ్రీనివాస్ స్వామి , యాదగిరి, రాములు, ప్రశాంత్ స్వామి ,సోమేశ్వర్, శ్రీనివాస్, బాలు, చందు ,రాజు, దేవరాజ్, కార్తీక్, దేవయ్య, అజయ్, రాజేశం, మధు, బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికష్ణ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల్ అధ్యక్షుడు గరిపల్లి రాములు, జిల్లా అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివ కుమార్ ,కిసాన్ మండల అధ్యక్షుడు మైహిపల్ రెడ్డి,కనకయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరహరి, తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో బీజేపీ జెండా ఎగరాలి : రఘునందన్ రావు



నవతెలంగాణ-గజ్వేల్

మే 13న జరగనున్న పార్లమెంట్ పోలింగ్ లో కమలం గుర్తుకు ఓటు వేసి మెదక్ పార్లమెంట్ స్థానం పై బిజెపి జెండా ఎగరాలని మెదక్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. మంగళవారం ఉదయం గజ్వేల్ పట్టణ బిజెపి నాయకులు కార్యకర్తల తో కలిసి మాట్లాడారు. సోమవారం రాత్రి జరిగిన రోడ్ షో విజయవంతం చేసిన కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం మీద ప్రత్యేక దృష్టి పెడతానని ఆయన చెప్పారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీ లు ఒకటేనని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు నందన్ గౌడ్, సురేష్, నాగు ముదిరాజ్, అరవింద్ తదితరులు ఉన్నారు.

వరి ధాన్యం కొనుగొల్లలో నిర్లక్ష్యం చేయొద్దు

- హుస్నాబాద్ తాహసిల్దార్ రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వరి ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని హుస్నాబాద్ తహసిల్దార్ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ ,బంజరుపల్లి, మార్కెట్ యార్డ్, నాగారం, మహమ్మదాపూర్, పందిళ్ళ, పొట్లపల్లి, మడద,రాములపల్లి లో కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కేంద్రాలను హుస్నాబాద్ తాహసిల్దార్ రవీందర్ రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని మార్కెటింగ్ కేంద్రాలలో నీడ, మంచినీళ్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ కంపల్సరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు . ఏ ఈ ఓ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని ధాన్యం ఆరబెట్టి సెంటర్ కు తీసుకురావాలని నాణ్యత ప్రామాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తోట మహేష్, ఐకెపి ఎపిఎం జి శ్రీనివాస్, సి సి అశోక్, సీఈవో తిరుమల, వి ఓ ఏ లు మమత, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుండి బిజెపిలో చేరిక



నవతెలంగాణ-మర్కుక్

దేశ ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వం సుస్థిర పరిపాలన పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నుండి బిజెపి చేరడం జరుగుతుందని బిజెపి పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్ లో బీఆర్ఎస్ నుండి ముదిరాజ్ సంఘం నాయకులు బీజేపీ పార్టీలో రాంరెడ్డి అధ్వర్యంలో చేరారు.వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బిజెపు చేరిన వారిలో కానమైన నవీన్,తూప్రాన్ నవీన్, చిట్టమైన శ్రీకాంత్,ములుగు సాయికుమార్,దండు బాబు ఉన్నారు.వారితో పాటు బీజేపీ నాయకులు సంజీవ్ రెడ్డి,పుట్ట ఆంజనేయులు,లింగ భాస్కర్, మైసిగారి బాలకృష్ణ,కృష్ణమూర్తి, సంతోష్ గౌడ్,నరేష్, కార్యకర్తలు ,తదితరులున్నారు.

బోయినిపల్లికి అవకాశమివ్వండి..అండగా ఉంటాడు

- ఎన్నికల ప్రచారంలో డాక్టర్ మాధవి



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి బోయినిపల్లి వినోద్ కుమార్ శాయశక్తుల కృషి చేశాడని మరోసారి ఎంఎంగా అవకాశమివ్వా లని.. అందరికి అండగా ఉంటాడని డాక్టర్ మాధవి నియోజకవర్గ ప్రజలను విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని దాచారం, లక్ష్మీపూర్, బేగంపేట, వడ్లూర్ గ్రామాల్లో కరపత్రాలతో కరీంనగర్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ మాధవి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి వినోద్ కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని డాక్టర్ మాధవి అభ్యర్థించారు.ఎంపీపీ నిర్మల,జెడ్పీటీసీ కడగండ్ల కవిత,నాయకులు ముక్కీస తిరుపతి రెడ్డి,రాజిరెడ్డి,దీటీ రాజు,అయా గ్రామాల నాయకులు తదితరులు ఆమె వెంట పాల్గొన్నారు.

రామాయణానికి రూ.5 వేలు విరాళం..

వడ్లూర్ గ్రామంలో నిర్వహిస్తున్న చిరుతల రామాయణం కళాకారులకు డాక్టర్ మాధవి రూ.5 వేలు విరాళమందజేశారు.హక్కుల కంటే బాధ్యత గొప్పదని రామతత్వం..కష్టాలలో కలిసి నడువాలని సీతతత్వం చేబుతుందని చిరుతల రామాయణం కళాకారులను డాక్టర్ మాధవి అభినందించారు.

బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరికలు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ప్రతి పేదవాని గడపకు చేరే విధంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ని భారీ మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కలిసి పని చేయాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 14 ఎంపి సీట్లు గెలవటం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, నాయకులు సాకి ఆనంద్, రియాజ్, బుచ్చిరెడ్డి, సిద్దిపేట రూరల్ మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తూరి నరహరి, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు రాములు, పుల్లూరు బండ లక్ష్మి నరసింహ దేవస్థానం చైర్మన్ కనకయ్య, కలీముద్దీన్, శ్రీశైలం, మంద పాండు, రాజేవీర్, వంశి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి అభిషేకం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని వర్ధరాజ్ పూర్ లో గల వీరాంజనేయ ఆలయంలో మంగళవారం ఆలయ దర్మకర్త పి.గోపాల కృష్ణ స్వామి అద్వర్యంలో సీతారామచంద్రస్వామి అభిషేకం, మంగళ స్నానాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నారన్నగారి రామ్మోహన్ రెడ్డి అద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద సీతా సీతారామచంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించినున్నట్లు తెలిపారు. ఈ కాల్యాణ వేడుకలు ఆదిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కపకు పాత్రలు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో పురోహితులు గుండు శ్రీనివాస్ శర్మపురుషోత్తమ చారి,భక్తులు, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఏఈవో సింధుజ ..

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి సిందూజ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విశాల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. సంఘం వారు పెట్టిన నియమ నిబంధనలు మేరకు సరైన తేమ శాతం 17 కి మించకుండా ఉండాలన్నారు. ధాన్యం అమ్మే సమయంలో రైతులు భూమి పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్ లు ఇచ్చి సెంటర్ ఇంచార్జ్ కి సహకరించాలని కోరారు.

నేటి నుంచి కొండపాక రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాలు

నవతెలంగాణ-కొండపాక

కొండపాక లోని పురాతన రామాలయంలో ఈనెల 17 నుంచి 25 వరకు సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం రామాలయంలో సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవం జరుగుతుందని దేవస్థాన కమిటీ చైర్మన్, డిసిసిబి చిట్టి దేవేందర్ రెడ్డి తెలిపారు. అలాగే ఈ నెల 25 వరకు ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణోత్సవం రోజు రాత్రికి మరుమామల శశిధర శర్మచే భక్తి సంగీత విభావరి కార్యక్రమం ,18న హనుమత్ సేవ, 19 గరుడ సేవ , 20న స్వామివారికి పొన్న సేవ, 21న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 22న రథస్థ స్వామి ఎదుట శకటోత్సవం, 23న షాడశోచారపూజ, రాత్రి యక్షగాన ప్రదర్శన, 24న దుష్ట శిక్షణ శిష్ట రక్షణ దోపు కార్యక్రమం, గ్రామంలో రథోత్సవం, 25న ఉత్సవ ముగింపు కార్యక్రమాలు జరుగుతాయి. వైదిక నిర్వహణ జనమంచి సీతారామశర్మ తదితరులు చేస్తారు భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'శ్రీరామ శోభాయాత్ర విజయవంతం చేయాలి'

నవతెలంగాణ-సిద్దిపేట



శ్రీరామనవమి పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలో బుధవారం నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దూది శ్రీకాంత్ రెడ్డి కోరారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని పాత వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి శోభాయాత్ర ప్రారంభమై లాల్ కమాన్, సుభాష్ రోడ్, పాత బస్టాండ్, వివేకనంద చౌరస్తా మీదుగా వెంకటేశ్వర దేవాలయం వరకు కొనసాగుతుందన్నారు.

సిద్దిపేట జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా కరుణాకర్ నియామకం



నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన పెద్దకురుమ కర్ణాకర్ కు భారతీయ జనతా యువమోర్చా సిద్దిపేట జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా నియమిస్తూ జిల్లా అధ్యక్షులు ప్రకటనలో తెలిపారు..ఈ సందర్భంగా కర్ణాకర్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా ఎన్నిక చేసిన మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకి బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు శ్రీ మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ..

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన హన్మండ్ల సందీప్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.మంగళవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలిపారు. అనంతరం మృతుని చిత్రపటం వద్ద పూలతో నివాళులర్పించారు.బీఆర్ఎస్ నాయకులు అయన వెంట హాజరయ్యారు.

గులాబీ అధినేతకు పూల వర్షం



నవతెలంగాణ-మర్కుక్: తెలంగాణ మాజీ సిఎం బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మంగళవారం తమ వ్యవసాయ క్షేత్రం నుండి సంగారెడ్డి జిల్లాలో బహిరంగ సభకు బయలు దేరారు. ఈ విషయం తెలుసుకున్న ఎర్రవల్లి మాజీ సర్పంచ్ కమ్మరి భాగ్యబాలరాజ్ గ్రామస్థులతో కలిసి దారిపొడవునా గులాబీ పువ్వులతో పూల వర్షం కురిపించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, సూపర్వైజర్ కనక చంద్రం మరియు సిబ్బంది, విద్యార్థినిల నుండి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సామ సువర్ణాదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతారాములు, డాక్టర్ స్రవంతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ ఇసుక నిల్వలపై ఆకస్మిక దాడులు..

- సుమారు 200 టన్నుల ఇసుక సీజ్ చేసిన టాస్క్ ఫోర్స్

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలపై విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి మంగళవారం అకస్మిక దాడులు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిల్వ చేసిన సుమారు 200 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్టు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలపై స్థానిక పోలీస్ అధికారులు చర్యలు చేపడుతారని తెలిపారు.



కాంగ్రెస్ అంటే కరువు అని ప్రజలకు అర్థమైంది

నవతెలంగాణ -జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే వందరోజుల్లో చేస్తానన్న రుణమాఫీ చేయకుండా, పెన్షన్లు పెంచకుండా మోసం చేస్తూ రైతులపై కపట ప్రేమ చూపిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఉన్న మాటలు ప్రస్తుతం లేవని అన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే యోచన లేదని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల్లో కనీసం నీళ్లు నింపే ప్రయత్నం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా రైతులకు అన్యాయం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే కరువు కాలమని రైతులకు నేడు అర్థమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి గెలుపు ఖాయమని తెలిపారు.



బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి రెడ్డికి అవమానం

- కాసులాబాద్ గ్రామంలో ప్రచార రథానికి చెప్పుల దండ

నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రచార రథానికి అవమానం జరిగింది. పాం్లమెంటు ఎన్నికల ప్రచారం లో భాగంగా మంగళవారం మెదక్ బీఆర్ఎస్ ఎం పీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కి చెందిన ప్రచార రథానికి కాసులాబాద్ గ్రామంలో చెప్పుల దండ వేశారు. ఈ వీడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతుంది



నీలం మధుకు సన్మానం

నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, రాంపూర్ మాజీ సర్పంచ్ కాశ బోయిన భాస్కర్‌లు మంగళవారం కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధును మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షులు ఫకీర్ నాయక్, సీనియర్ నాయకులు కాశబోయిన శ్రీనివాస్, యువజన అధ్యక్షులు మద్దూరి రాజు, మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని పోతంశెట్టిపల్లి దుర్గా వైన్స్ సమీపంలో గల మంజీరా నదిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా మతిని వయస్సు (28) వరకు ఉంటుందని.. ఎత్తు 5. 7, నల్లనిగడ్డం, బిస్కట్ కలర్ హాఫ్ బనీన్, బ్లూ డ్రాయర్, కుడిచేతి పైన స్టార్ టైప్ గల పచ్చబొట్టు ఉందన్నారు. నది ఒడ్డు పైన నల్లపట్టి, తెలుపు రంగు కలర్ లబ్బరు చెప్పులతోపాటు ఆరెంజ్ కలర్ ఫుల్ షర్ట్, బ్లూ కలర్ పాయింట్, చేపలు పట్టే గాలం ఉందని గుర్తించారు. చాపలు పట్టడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయినట్లు అనుమానం కలుగుతోందన్నారు. మతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లైతే 8712657919, 8712657916 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

